

శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నిఖిల్

రామనర్సాపురంలో ప్రత్యేక వైద్యశిబిరం

బుట్టాయగూడెం, జూలై 11 : మండలంలోని రామనర్సాపురంలో ఎల్ఎన్‌డీపేట వైద్యాధికారి డాక్టరు కె.నిఖిల్ గురువారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని కొండరెడ్లకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. రామనర్సాపురంలో అధిక సంఖ్యలో కొండరెడ్లు కిడ్నీలో రాళ్ళతో బాధ పడుతున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే స్పందించిన అధికారులు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. అందరి వద్ద నుంచి వైద్యాధికారులు రక్త నమూనాలను సేకరించారు. పరీక్షలు తర్వాత వ్యాధులు ఏమైనా బయటపడితే మందులు పంపిణీ చేస్తామన్నారు. చిన్నపాటి సమస్యలు ఉన్నవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జె.దుర్గాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలలో బాలికకు డెంగీ

▸ వైద్య సిబ్బంది అప్రమత్తం

ద్వారకా తిరుమల, జూలై 11: ద్వారకా తిరుమలలో ఒక బాలికకు డెంగీ జ్వరం సోకడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలో జ్వరాలున్నాయా అంటూ సర్వే నిర్వహించారు. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన వరిగేటి గాయత్రికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ఏలూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స అనంతరం కోలుకుంది. ఆమెను బుధవారం ఇంటికి తీసుకొచ్చారు. వైద్య, పంచాయతీ సిబ్బంది గ్రామంలో అత్యవసర పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల నివారణకు మందు జల్లారు. ఇంటింటికీ తిరుగుతూ జ్వరాలపై ఆరా తీశారు.

కనీస వేతనం చెల్లించాలి

▸ కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టూటౌన్, జూలై 11 : కార్మికులకు కనీస వేతనం చెల్లించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎస్ఎంఆర్ వేతన కమిటీ సమావేశంలో దినసరి వేతనాన్ని నిర్ణయించారు. నైపుణ్యం గల వారికి రోజుకు రూ.710, పాక్షిక నైపుణ్యం గల వారికి రూ.640, నైపుణ్యంలేని వారికి రూ.595 వేతనాలుగా నిర్ధారించారు. ఈ వేతనాలు 2024 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయన్నారు. కనీసం వేతనం కన్నా తక్కువ ఇచ్చే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కే.సురేష్, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ కే.రాజు, ఆర్అండ్‌బీ ఈఈ కిషోర్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ మండలం లక్ష్మీపురంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదల నడుమ జగనన్న ఇళ్ల పునాదులు



కదలని ఇళ్లు!

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలు మందకొడిగానే సాగాయి. గృహ నిర్మాణాల విషయంలో లబ్ధిదా రులకు అంతంత మాత్రంగానే చేయూత లభించింది. ఆ ప్రభుత్వ హయాంలో లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా ఆశించిన స్థాయిలో గృహ నిర్మాణాలు జరగక పోవడం గమనార్హం. అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయలేదనే విమర్శలు వినిపించాయి. ముఖ్యంగా కాలనీలలో గృహ నిర్మాణాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా వెనుకబడింది.

లబ్ధిదారులను మభ్యపెట్టిన వైసీపీ సర్కార్

▸ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహాలు 10 వేలు మాత్రమే..

▸ సొంత స్థలాలు ఉన్న ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లు 30 వేలు

▸ లక్ష్యానికి తక్కువగానే ఇళ్ల నిర్మాణం

ఏలూరు సిటీ, జూలై 11 : గతంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ గృహ నిర్మాణ పథకంగా మార్పు చేసి రెండేళ్ల తర్వాత 2021-22లో గృహ నిర్మాణాలను మొదలు పెట్టారు. 2019లో అధికారంలో వచ్చిన నాటి వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేసి గృహ నిర్మాణాలు చేపట్టింది. ఏలూరు జిల్లాకు సంబంధించి 778 కాలనీల్లో మొత్తం 55 వేల గృహ నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించి అప్పట్లో 10 వేలు గృహ నిర్మాణాలను మాత్రమే పూర్తి చేసిందని, దాదాపు 3 వేలకు పైగా గృహ నిర్మాణాలు అసలు ప్రారంభం కాలేదని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి స్థలాలు లెవెలింగ్, అప్రోచ్ రహదారులు, అంతర్గత రహదారులు, ప్రియారిటీ అండ్ రిపేర్, సిమెంట్ గోదాములు, కల్వర్టులు, విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు సంబంధించి ఓటీఎస్ గ్రాంట్ ద్వారా సుమారు రూ.60 కోట్లు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ పను లన్నీ సొంతవారికే కేటాయించినట్టు అప్పట్లో విమర్శ లు వచ్చాయి. అయితే సకాలంలో పనులు పూర్తి చేయక పోవడంతో ఆయా కాలనీల్లో గృహాలు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి కనిపించింది. కొన్ని కాలనీల్లో అయితే నివాసయోగ్యం కావని ఇప్పటికీ లబ్ధిదారులు ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలను చేపట్టడం లేదు. ఏదో రకంగా ఆయా కాలనీల్లో గృహాలు నిర్మించుకున్న వారు చుక్క వర్షం కురిస్తే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మూడేళ్ల పాటు జరిగిన గృహ నిర్మాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని కాలనీల్లో అయితే మౌలిక సదుపాయాల కల్పించకపోవడంతో ఆయా కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టలేదు. కొన్ని కాలనీల్లో స్థలాల లెవెలింగ్, అప్రోచ్, అంతర్గత రహదారులు అంతంత మాత్రంగానే ఉండడంతో ఇళ్లు నిర్మించుకున్నా అక్కడ నివాసం ఉండడానికి అవకాశం లేకుండా పోయిందని లబ్ధిదారులు అప్పట్లో వాపోయారు. ఇలా పరిశీలిస్తే మొత్తం మీద జిల్లాలో 778 లే అవుట్లు వేసినా అందులో అంతంత మాత్రంగానే గృహ నిర్మాణాలు జరిగాయి. ఇప్పటి వరకు గృహ నిర్మాణ శాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం గత ప్రభుత్వ హయాంలో 55 వేలు ఇళ్ళు లేఅవుట్ కాలనీల్లో నిర్మించాల్సి ఉండగా కేవలం 10 వేల ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని చెబుతున్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని జిల్లా గృహనిర్మాణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు పీఎంఏవై నిధులతో నిర్మించినా వైఎస్ఆర్ గృహ నిర్మాణాలుగా పేర్కొన్నారు.

సొంత స్థలాల్లో లబ్ధిదారుల చొరవ

ఇక సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 43 వేల ఇళ్లు కేటాయించగా ఇప్పటివరకు 30 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా మిగిలినవి వివిధ దశల్లో ఉందని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సొంత స్థలాల లబ్ధిదారులకు సంబంధించి డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేలు వరకు రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలను కొనసాగించారు. ఆ రకంగా కూడా పరిశీలిస్తే రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు తక్కువ శాతమే. ఏది ఏమైనా గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో బలహీన వర్గాలకు కేటాయించిన గృహ నిర్మాణాలు అంతంత మాత్రంగానే కొనసాగాయి. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్నా బిల్లులు మంజూరులో ఇబ్బందులకు గురి చేశారని లబ్ధిదారులు వాపోతున్నారు.



ఈ గొయ్యి మాది కాదు..!

చింతలపూడి పట్టణం రత్నా సెంటర్లో ఆర్ అండ్‌బీ రోడ్డుపై కొన్ని నెలలుగా ఒక పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇందులో పడి వాహనాలు దిగబడిపోతున్నాయి. అవి పైకి రాలేక ఎక్స్‌కవేటర్లను వినియోగిం చాల్సి వస్తోంది. దిగబడిన లారీల వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. వర్షం వచ్చినప్పుడు ద్విచక్ర వాహన దారులు జారి పడిపోతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుం టాయి. అటు ఆర్అండ్‌బీ, ఇటు నగర పంచాయతీ అధికారులు ఈ పని తమది కాదంటే తమది కాదని పక్కన పెడుతున్నాయి. గురువారం ఇలా ఓ లారీ ఇరుక్కుపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో తీశారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే సొంగా రోషన్ గొయ్యిని పూడ్చాలని ఆర్అండ్‌బీ అధి కారులను హెచ్చరించారు. అప్పుడు కాని వారు కదల్లేదు.

- చింతలపూడి



చెరువులో డ్రెయినేజీ మట్టి..

సాగునీటి చెరువులో పూడిక పెరిగితే రైతుల కోరిక మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించి పూడిక తొలగిస్తుంది. కాని చింతలపూడి పెద్ద చెరువు పట్ల అధికారుల తీరు విచిత్రంగా ఉంది. ఈ చెరువులో ఇప్పటికే ఆక్రమణల జోరు పెరిగిందని, వాటిని తొలగించాలని, పూడిక తీయాలని ఆయకట్టు రైతులు కోరుతుంటే తాజాగా చింతలపూడి మునిసిపల్ అధికారులు పట్టణంలో డ్రెయినేజీల్లో తీసిన మట్టిని ఈ చెరువు గర్భంలో పోస్తున్నారు. దీనిపై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇదేం పద్ధతి అంటూ వాపోతున్నారు. మరోవైపు ఇదే అదనుగా ఆక్రమణదారులు ఈ పూడిక మట్టిని చదును చేసి చెరువునే ఆక్రమిస్తున్నారని, మున్సిపల్ అధికారుల తీరుపై ఆయకట్టు రైతు సంఘం మాజీ అధ్యక్షుడు చిట్లూరి అంజిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.

- చింతలపూడి



పారిశ్రామికాభివృద్ధికి చేయూత

▸ మంత్రి పార్థసారథి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి.. చిత్రంలో ఎంపీ పుట్టా మహేష్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు

ఏలూరు అర్బన్, జూలై 11 : పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం స్నేహపూర్వక చేయూత అందిస్తుందని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పారిశ్రామిక, పర్యావరణ, కార్మిక భద్రతలపై గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్థ నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో పారిశ్రామికా భివృద్ధి కుంటుపడిందని, అటువంటి వాతావరణాన్ని సరిదిద్ది, పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించే దిశగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు.

- ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలస్థాపనకు పలువురు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతుండటం రాష్ట్రాభివృద్ధికి శుభపరిణామమన్నారు. జిల్లాలో స్థాపించే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. కొల్లేరు అభయారణ్యం పరిధిని ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు తగ్గించాల్సిం దిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మూడో కాంటూరులో 10 కిలోమీటర్ల పరిధిని గ్రీన్‌జోన్‌గా ప్రకటించి కాలుష్యరహిత పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాన్ని కోరామన్నారు. వచ్చే సెప్టెంబరు నుంచి ప్రతీ వారం జిల్లావ్యాప్తంగా జాబ్‌మేళాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.
- కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సింగిల్ విండో పథకంలో పరిశ్రమల స్థాపనకు నిర్దేశించిన సమయంలోనే సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరు చేస్తామన్నారు.
- కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పారిశ్రామిక వేత్తలు తాగునీరు, రోడ్ల అభివృద్ధి, తదితర సేవలకు సహకరించాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచించారు.
- పరిశ్రమల పరిసరాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో పనులు చేపట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకురావాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు.
- వెనుకబడిన పోలవరం గిరిజనప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు.

సమావేశంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ పరిశ్రమ ప్రతినిధి చౌదరి, ఎస్సార్ సీడ్స్ ప్రతినిధి వెంకటరావు, రుద్రా ఇండస్ట్రీస్ గోపాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవోలు ఖాజావలి, అద్దయ్య, భవాని శంకరి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, పీసీబీ ఈఈ వెంకటేశ్వరరావు, కర్మాగారాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీనివాస్, ఏపీఐఐసీ జడ్ఎం బాబ్జి, ఉద్యానవనాలశాఖ డీడీ రామ్మోహన్, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు.. మహర్దశ

▸ వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గృహాలు

▸ కూటమి అధికారంలోకి రాగానే దృష్టి సారింపు

▸ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి అడుగులు

ఏలూరు రూరల్, జూలై 11 : జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లుగా సంక్షేమ వసతి గృహాలన్నీ అరకొర వసతుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. పెచ్చులూడిన పైకప్పులు శిథిలమైన భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి లేమితో విద్యార్థులు, వార్డెన్‌లు నరకం అనుభవించారు. గత నాలుగేళ్లలో పలుదఫాలుగా నిధులు కేటాయిం చాలని ఆయా సంక్షేమ శాఖల అధికారులు గత ప్రభుత్వానికి నివేదికలు పంపినా, అవన్నీ చెత్తబుట్టకే పరిమితం కావడంతో అరకొర వసతుల నడుమ విద్యార్థులు వసతి పొందాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. కొద్దిరోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో విద్యార్థుల అవస్థలను వివరిస్తూ కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో సంక్షేమ పథకాలను ఒక్కొక్క టిగా నెరవేరుస్తూ వస్తోంది. దీనిలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుని వసతి గృహాలను మెరుగుపరచా లని నిర్ణయం తీసుకున్నారు. ఏలూరు జిల్లాలోని ఎనిమిది వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతగా అధిక సమస్యలు ఉన్న వసతి గృహాలను ఎంపిక చేశారు. ఆ వసతి గృహాల్లో ప్రధానంగా ఎలక్ట్రికల్, రూఫ్, పెయింటింగ్, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు, డ్రెయిన్లు, పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఆయా సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ సమస్యలు ఎదుర్కొంటున్న హాస్టళ్ల నివేదికలను ప్రభుత్వానికి పంపినట్టు తెలుస్తోంది.



ఏలూరు బాలుర వసతిగృహం

ఉచిత ఇసుక.. ఆంక్షలు విధింపు

▸ చాట్రాయి మండల ప్రజల ఇక్కట్లు

చాట్రాయి, జూలై 11 : కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానంలో అధికారులు అనేక ఆంక్షలు అమలు చేస్తుండడంతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలం ఎన్టీఆర్ జిల్లా పక్కన ఉండటంతో, ఇసుక కోసం విజయవాడ సమీపంలోని రీచ్‌లకు వెళితే అధికారులు ఏలూరు జిల్లాకు వెళ్ళమంటున్నారని, ఏలూరు జిల్లాలో సరైన ఇసుక రీచ్‌లే లేవని పలువురు వాపోతున్నారు. పైగా ఇంటి నిర్మాణ అప్రూవల్, వీఆర్వో ధ్రువీకరణ అడుగుతున్నారని, పల్లెటూరులో చిన్న చిన్న ఇళ్ళు కట్టుకునే పేదల దగ్గర పర్మిషన్లు ఎలా ఉంటాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. అర్థంపర్థం లేని ఆంక్షలతో ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఆధార కార్డు, ఇల్లు నిర్మించుకుంటున్నట్టు స్థానిక అధికారి ధ్రువీకరణ ఉంటే ఇసుక సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఈ సమస్యను నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళగా కలెక్టర్‌తో మాట్లాడి ఇసుక సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

నీరందక..

▸ ఎండుతున్న వెదజల్లిన సార్వా వరి పైరు

▸ బీటలు వారుతున్న పొలాలు



పెనుమల్లి,సంకర్షణపురంలో నీరందక ఎండిపోతున్న వెదజల్లిన సార్వా వరి పైరు



ముదినేపల్లి, జూలై 11 : సాగునీరందక, సరైన వర్షాలు కురియక ముదినేపల్లి మండలంలోని వెదజల్లిన వరి పైరు వెలవెలబోతున్నది. సార్వా సీజన్ అదును తప్పుతుందన్న కారణంగా రైతులు చిన్నపాటి జల్లులపై ఆధారపడి ముందస్తుగానే వరి విత్తనాలు వెదజల్లారు. రుతుపవనాలు వచ్చినా 15 రోజులుగా వర్షాలు ఆశాజనకంగా కురవకపోవడం, కాల్వలకు నీటి విడుదల ఆలస్యం కావడంతో వెదజల్లిన సార్వా వరి భూములు బీటలు వారాయి. పలు గ్రామాల్లో వరి పైరు ఎండి పోయి పనికి రాకుండా పోయే పరిస్థితి ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల వరకు కాల్వల ద్వారా సాగునీరు పొలాలకు చేరే అవకాశం లేకపోవడంతో వెదజల్లిన భూములను దున్నేసి తిరిగి వెదజల్లేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.7 నుంచి 9 వేల వరకు ఖర్చు కాగా, తిరిగి ఎదజల్లడం భారమవుతుందని చెబుతున్నారు. మండలంలో 17 వేల ఎకరాల్లో సార్వా వరి సాగు జరుగుతుండగా, సుమారు 13 వేల ఎకరాల్లో వెదజల్లే విధానంలోనే వరి సాగు చేస్తున్నారు. నీరందక సుమారు 4 వేల ఎకరాల్లో వెదజల్లిన వరి పైరు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో కురుస్తున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 11 : జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో 7.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 1.3 మి.మీ నమోదైంది. చాట్రాయి 5.4, దెందులూరు 3.8, ఏలూరు రూరల్ 3.6, పోలవరం 2.2, బుట్టాయిగూడెం 2, పెదవేగి 2, జీలుగుమిల్లి, చింతలపూడి మండలాల్లో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షాల రాకతో సార్వా పంటల సాగు పనులు జోరుగా సాగుతున్నాయి.

నీరు అందించాలి



వర్షాలపై ఆధారపడి ముందుగానే వరి ఎదజల్లాం. అవసరమైన మేరకు వర్షాలు కురవకపోవడం, ఇప్పటి వరకు సాగునీరు అందకపోవడంతో పైరు ఎండిపోతోంది. భూములకు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఏసుపోగు దానియేలు, కౌలు రైతు, పెనుమల్లి

మళ్లీ వెదజల్లడం కష్టమే



వెదజల్లిన పైరు నీరు లేక పాడైపోయింది. మళ్లీ వెదజల్లి సాగు చేయడం కష్టమే. నీరందించకపోతే పైరుపై ఆశలు వదులుకోవాల్సిందే.

- రేమల్లె విజయకుమార్, రైతు, సంకర్షణపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు కావాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ద్వారకాతిరుమల, జూలై 11: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు కావాలని,60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య విమర్శించారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో గురువారం జరిగిన రైతు సంఘ జిల్లా స్థాయి శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మన దేశంలో పండే రొయ్యలు, మిర్చి, పత్తి, పొగాకు తదితర పంటలను ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తున్నామని, రైతులు ఎంత కష్టబడినా కనీస మద్దతు ధర కరువైందని ఆవేదన చెందారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించడం ఆపాలని ఎక్కడైనా మీటర్లు బిగిస్తే రైతులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, గారపాటి వెంకట సుబ్బారావు, బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతా రామయ్య, కె.జలపాలు, కొనా శ్రీనివాసరావు, జి.సురేష్, నందమూరి సుబ్బారావు, బోయపాటి సత్యనారాయణ, టి.మురళి, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పే అండ్ అక్కౌంట్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరనాథ్

ఏలూరు అర్బన్, జూలై 11: పే అండ్ అక్కౌంట్స్ కార్యాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ గురువారం రాష్ట్ర సచివా లయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేసినట్టు ఏపీ పేఅండ్ అక్కౌంట్స్ ఆఫీస్ (వర్క్ అక్కౌంట్స్) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ హరనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సర్వీస్ మేటర్స్‌లో ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని వివరించారు. ఉద్యోగులు కూడా నిబంధనలకు లోబడి కష్టపడి పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంలో కృషి చేయాలని సూచించారని తెలిపారు. మంత్రిని కలిసిన సంఘ నాయకుల్లో నాగభూషణం, శ్రీనివాసరావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీఎల్ ఇందిరాదత్

సౌర విద్యుత్‌పైనే ప్రపంచ దృష్టి

భీమవరం టౌన్, జూలై 11 :సౌర విద్యుత్ పైనే ప్రపంచం దృష్టి ఉందని, 2023 నాటికి భారతదేశంలో 5.8 శాతం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎల్ ఇందిరా దత్ అన్నారు. భీమవరంలో ఓఆర్‌బీ ఎనర్జీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం సోలార్ ఎనర్జీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందిరా దత్ మాట్లాడుతూ ఇప్పటికే పెద్ద హోటళ్లు, హాస్పటళ్లు వంటివి సోలార్ ప్యానల్స్ పెట్టుకుంటున్నాయని, ఇది ప్రపంచంలో మన స్థానాన్ని బాగా మెరుగుపరచిందన్నారు. 2023లో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద సౌర విద్యుత్ జనరేటర్‌గా అవతరించిందని, వేగవంతమైన సౌర విద్యుత్ విస్తరణలో జపాన్‌ను అధిగమిం చామన్నారు. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి 2015లో 0.5 శాతం ఉండగా 2023 నాటికి 5.8 శాతానికి పెరిగిందన్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ కే.శ్రీనివాసరావు, వెంకట్, కృష్ణ వంశీ,రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వేలేరుపాడులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బోరుగడ్డ అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు

వేలేరుపాడు, జూలై 11: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, ఇతర టీడీపీ నాయకులపై బోరుగడ్డ అనిల్ వ్యక్తిగత విమర్శలతో పాటు వారి కుటుంబాలపై కూడా విమర్శలు చేయడం పట్ల వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సానుభూతిపరుడుగా ఉన్న అనిల్ అప్పటి ప్రతిపక్ష నాయకులపై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడని గతంలో కూడా అతనిపై టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినప్పటికి అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదన్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన అనిల్ తన దూషణల పర్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడని అతనిపై తక్షణం చర్యలు తీసుకుని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ గురువారం టీడీపీ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, యాళ్ళ శంకరరావు, పసుమర్తి మోహన్, మహిళా నాయకురాలు రాణి వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామికి ఆషాఢం సారె

కైకలూరు జూలై 11 : ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి, శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి కైకలూరుకు చెందిన పలువురు మహిళలు సారెను అందజేశారు. గురువారం కైకలూరు బ్రహ్మంగారి గుడి వీధి, కాల్వ గట్టు నుంచి మహిళలు పెద్దఎత్తున సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి, స్వామివారికి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కే శేఖర్ తన సిబ్బందితో వారికి ఆహ్వానం పలికారు. ఆలయ అర్చకులు అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో శశికళ, అరుణకుమారి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు కావాలా ?



అయితే..చెయ్యి తడపాల్సిందే..!

విచారణ పేరుతో డబ్బులు డిమాండ్

భీమవరం క్రైం, జూలై 11 : ఎవరైనా ఇతర దేశాలకు టూర్‌లు వెళ్లాలన్నా, ఉపాధి, ఉద్యోగం, చదువు నిమిత్తం విదేశాలకు వెళ్లాలన్నా తప్పనిసరిగా పాస్‌పోర్టు అవసరం. అనంతరం వీసా కావాలి. అయితే వీసా కంటే ముందు పాస్‌పోర్టు కోసం నానా ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి వారు ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు సంబంధిత పాస్‌పోర్టు కార్యాలయంలో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటారు. అది ఆన్‌లైన్ అయిన తరువాత సంబంధిత వ్యక్తి ఇచ్చిన చిరునామాలో ఉన్నారా ? వారిపై ఏమైనా క్రిమినల్ కేసులు ఉన్నాయా? అని విచారణ చేయవలసి ఉంటుంది. దాని కోసం పోలీస్ శాఖ నుంచి ఒక ఏరియాకు ఒక అధికారిని నియమిస్తారు. దరఖాస్తుదారుడికి అడ్రస్, కేసుల గురించి ఎంక్వయిరీ చేసి పైఅధికారులకు నివేదిక పంపిస్తారు. అయితే కొందరు అధికారులు ఎంక్వయిరీ కోసం వచ్చినప్పుడు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు కొందరు దరఖాస్తుదారులు చెబుతున్నారు. అన్ని సక్రమంగా ఉన్నా కూడా ప్రభుత్వం నుంచి లక్షల్లో జీతాలు వస్తున్నప్పటికీ పెట్రోల్ ఖర్చులు, సాధారణ ఖర్చులు పేరుతో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. అలా డబ్బు ఇవ్వని పక్షంలో ఫాల్స్ అడ్రస్ అనిగాని, హౌస్ లాక్డ్ అని గాని నివేదికలో రాసి పంపిస్తామని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇలా చెయ్యడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు వారు పాస్‌పోర్టు కోసం ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు వీసా ఇప్పిస్తామంటూ కొందరు ఏజెంట్లు మోసం చెయ్యడంతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు ఏమీ అందలేదు. డబ్బులు డిమాండ్ చేసి ఎవరైనా ఇబ్బంది పెడితే నా దృష్టికి తీసుకు వస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

-తిలక్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, పశ్చిమ గోదావరి జిల్లా



మెరిట్ జాబితా విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ అధికారులు

ట్రిపుల్ ఐటీ మెరిట్ జాబితా విడుదల

67.15 శాతం బాలికలు ఎంపిక

నూజివీడు, జూలై 11: ఆర్జీయూకేటీలో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశానికి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితాను గురు వారం ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది 53,863 మంది ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో ఒక్కో క్యాంపస్‌లో వెయ్యిసీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా 100 సీట్లతో నాలుగు క్యాంపస్‌లకు మొత్తం 4,400 మంది విద్యార్థులతో భర్తీ చేస్తారు. వీరిలో 85 శాతం ఏపీ విద్యార్థులు ఉంటే 15శాతం ఓపెన్ మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు కేటాయిస్తారు. ఈ ఏడాది ఎంపిక కాబడిన విద్యార్థుల జాబితా ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 92.99 శాతం మంది, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 7.01శాతం ఉంది. ఎంపికైన విద్యార్థుల్లో 67.15 శాతం బాలికలు, 32.85 శాతం మంది బాలురు ఉన్నారు. ఎంపిక కాబడిన విద్యార్థులు నూజివీడు ప్రాంగణంలో ఈనెల 22,23వ తేదీల్లో, ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ) ఎంపిక కాబడిన విద్యార్థులకు 22,23 తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లోనూ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కాబడిన విద్యార్థులకు ఈనెల 24,25 తేదీల్లో ఇడుపులపాయ ప్రాంగణంలో, శ్రీకాకుళం ప్రాంగణానికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 26,27 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తాని అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ www.rgukt.inIZ పెట్టామన్నారు. దరఖాస్తులో తెలిపిన ఫోన్ నంబర్లకు మెసేజ్, ఎస్ఎంఎస్ ద్వారా వివరాలు తెలిపామన్నారు. ఏ విద్యార్థి ఏ క్యాంపస్‌కు కౌన్సెలింగ్‌కు వెళ్లాలో కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లాల్సిన సర్టిఫికెట్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు.

ద్వారకాతిరుమలలో అన్న,చెల్లెలకు..





ద్వారకాతిరుమల, జూలై 11:ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం కె.లీలాకుమార్ తెలిపారు. పదవ తరగతిలో 600కు 574 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణతేజకు, అలాగే 600కు 573 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణ చైతన్యకు సీట్లు వచ్చినట్లు వివరించారు. ఐఐఐటీ ప్రవేశాలకు విడుదలైన మెరిట్ లిస్ట్‌లో వీరి పేర్లు ఉండటంతో గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థులను గ్రామ పెద్దలు, తల్లితండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

ఇద్దరు గురుకుల విద్యార్థులకు..



తాడేపల్లిగూడెం రూరల్ :తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు బుర్రే ప్రకాష్ (పదో తరగతిలో మార్కులు 577). టేకు కుమార్ సత్యసాయిశ్రీ (575) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారావు గురువారం తెలి పారు. ప్రకాష్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో, కుమార్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు వివరించారు. విద్యార్థులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీసీవో భారతి, ఎంఈవో హనుమ అభినందించారు.

వామనమూర్తిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 11: వామనమూర్తిగా జగన్నాథుడు గురువారం భక్తజనులకు దర్శనమి చ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం, పాత్రను ధరించి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కి వేస్తున్నట్లున్న అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. లక్ష్మీపురం ఆలయంలో ఈనెల 7న ప్రారంభ మైన జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ మండ పంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారాలు భక్తులను అలరిస్తున్నాయి.

పెరిగిన గోదావరి నీటిమట్టం



పోలవరం, జూలై 11 : పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణప్రవర నదుల నుంచి వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతోంది.స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.900 మీటర్లు, స్పిల్వే దిగువన 17.000 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.980 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 15.980 మీటర్లు నమోదయినట్లు ఈఈలు వెంకటరమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,726 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి బుధవారం 6,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఎత్తి పోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.249 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 19 పంపులు 19 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



లోకుముడిలో ఆక్వాషాపులను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

మండవల్లి జూలై 11 : మండవల్లి మండలంలోని పలు ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పెరుగుతున్న కల్తీలను నివారించేందుకు రైతులకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం మత్స్యశాఖ, రెవెన్యూ డ్రగ్‌ఫుడ్, పోలీసు, ఎంపీడీవో అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిందని కైకలూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బా షా తెలిపారు. లోకుముడిలోని నాలుగు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి నిషేధిత మందులు దొరకలేదని తెలిపారు. రైతుల ఉన్నతి కోసం ప్రభుత్వం పాటుపడుతుందని అందులో భాగంగా నాణ్యమైన విత్తనాలు, మందులు, మేతలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇటీవల ఆక్వాసాగులో యాంటీబయోటిక్స్ ఎక్కువగా వినియోగించడం వల్ల ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్న మన రొయ్యల్లో యాంటీబయోటిక్స్ అవశేషాలు ఉండడంతో వాటిని వెనుకకు పంపుతున్నారని తెలిపారు. ఆక్వా దుకాణ దారులు యాంటీబయోటిక్స్ అమ్ముతూ మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు జరిమానా విధిస్తామని మూడోసారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్ అధికారి జీవని, పెంపెడా అధికారి అమర్నాథ్. వీఆర్వో యువరాజ్ ఉన్నారు.



హోటల్స్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

పాచిపోయిన చికెన్..విషం చిమ్మే ఆయిల్

హోటల్స్, రెస్టారెంట్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 11: తాడేపల్లిగూడెంలో హోటల్స్ రెస్టారెంట్ల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. కొంతమంది ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. పాచి పోయిన చికెన్, రోజుల తరబడి ఉపయోగించిన ఆయిల్, ఫుడ్ కలర్స్, బ్యాన్ చేసిన టేస్టీ సాల్ట్ విపరీతంగా వాడుతున్నారు. గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందర రామిరెడ్డి పట్టణంలో పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించగా ఇలాంటివే బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌లో రోజుల తరబడిన దాచిన చికెన్, వండి వార్చిన బిర్యానిలు కనిపించాయి. వాటితో పాటు రోజుల తరబడి ఉపయోగించిన ఆయిల్స్ వాడుతున్నట్టు గుర్తించారు. దీనిపై సుందర రామిరెడ్డి సాంపిల్స్ సేకరించి ల్యాబ్ పరీక్షల కోసం తరలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 8 రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించి అందరికీ నోటీసులు జారీ చేశామని ఎవరికీ ఫుడ్ లైసెన్స్ లేదని వివరించారు. వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఉన్న మరిన్ని రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని ఎవరూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేయవద్దని సూచించారు.

చోరీల్లో వారు ఎక్స్‌పర్ట్స్

అంతర రాష్ట్రాల ముఠా సంచారం

అనాథలకు చందాల పేరుతో రెక్కీ



భీమవరం బంగారు దుకాణాల ఏరియాలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల మహిళలు

భీమవరం క్రైం, జూలై 11 : వారంతా ఒకటే ముఠా.. కలిసికట్టుగా వస్తారు. షాపులు, నివాసాలు వద్ద అనాథలకు సాయం చెయ్యండి .. అంటూ చందాలు అడుగుతారు. వారికి ఏమైనా విలువైనవి కనిపించాయా వాటిని చోరీ చెయ్యడంలో చాలా చేయితిరిగిన వారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన భీమవరంతో పాటు నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో ఇలాంటి ముఠా సంచరిస్తోంది. జీన్స్ ఫ్యాంట్స్, టీషర్ట్స్, మంచి మంచి చీరలు ధరించి చేతిలో పుస్తకాలు పట్టుకుని తిరుగుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల నుంచి కొంతమంది ఈ ప్రాంతాలకు వస్తుంటారు. ప్రతీ ఏడాది ఒక నెలపాటు ఈ ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటారు. అయితే వారితో పాటుగా పురుషులు కూడా వస్తున్నట్లు చెబుతున్నారు. ముందుగా మహిళలు రెక్కీ నిర్వహించి అనువైన ప్రాంతాల్ని పురుషులకు తెలియపర్చుతారని కొందరు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపై పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థిపై కొండముచ్చు దాడి.. స్వల్ప గాయాలు



జంగారెడ్డిగూడెం, జూలై 11 : జంగారెడ్డిగూడం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తెల్లం వంశీ అనే బాలు డిపై గురువారం కొండముచ్చు దాడి చేసింది. బాలుడి చేతికి గాయం అవడంతో పాఠశాల హెచ్ఎం లోవకుమారి స్థానిక ఏరియా ఆసుపత్రికి పంపి ప్రథమ చికిత్స అందించారు. ఆమె మాట్లాడుతూ కొంతకాలంగా కొండ ముచ్చు తమ పాఠశాలలో సంచరిస్తోందని ఎవరికీ ఎటువంటి హాని చేయదని అన్నారు. అయితే రెండు రోజుల క్రితం కొండముచ్చు చేతికి గాయమైందని అప్పటినుండి పిచ్చిగా ప్రవర్తిస్తోందన్నారు. విద్యార్థిపై దాడి చేసిన వెంటనే జిల్లా వైల్డ్‌లైఫ్ అధికారులకు ఫిర్యాదు చేశామని కొండ ముచ్చును పట్టి అడవిలో వదిలి పెడతామని చెప్పారని తెలిపారు.

బైక్‌లు ఢీ..ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం, జూలై 11: బుట్టాయగూడెం-కన్నాపురం రోడ్డులోని కంసాలికుంట సమీపంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బుట్టాయగూడెం నుంచి కన్నాపురం వైపుగా వెళుతున్న స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ ఎన్.శ్రీనివాస వర్మ, రాచూరు నుంచి బుట్టాయగూడెం వైపుగా వస్తున్న వెట్టి సుందరరాజులు ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలపై కంసాలికుంట సమీపంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలవగా 108లో స్థానిక సీహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఏఈకి బుట్టాయగూడెంలోనే వైద్యం అందించగా మెరుగైన వైద్యం కోసం సింధురాజును జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

పాలకొల్లులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాలకొల్లు అర్బన్, జూలై 11 : పాలకొల్లు న్యూక్లాత్ మార్కెట్ వద్ద ఒక బట్టల షాపు సమీపంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. పట్టణ పోలీసులు మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 94407 96668, 08814- 222333 నంబర్లకు సమాచారం అందజేయాలని పోలీసులు తెలిపారు.

అనుమనాస్పద స్థితిలో వివాహిత మృతి

కొయ్యలగూడెం, జూలై 11 :కొయ్యలగూడెంలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ పేటకు చెందిన ఉందుర్తి తనూజ (25) బుధవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందిందని మృతిరాలి భర్త అనిల్ కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మృతురాలి తండ్రి బాబురావు తన కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 11 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి ఒక గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని తేల్లప్రోలు రైల్వే గేటు సమీపంలో సుమారు 20 నుంచి 30 ఏళ్ల వయసు కల్గిన యువకుని మృత దేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళారు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు కల్గి, నీలం రంగు పొట్టి చేతుల టీషర్టు, నీలం రంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జూలై 11 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ గట్టిగా కేకలు వేస్తూ ఆకస్మాత్తుగా కిందపడిపోవడంతో ఆమెను ఆసుపత్రికి

క్రైం కార్నర్

తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన కట్టా రంగమ్మ (51) బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ కలహాలు జరిగాయి. ఆమె కుమారులు మధ్య వివాదాలు ఉండడంతో ఆమె తన కుమారుడిని గట్టిగా మందలించారు.ఈ నేపథ్యంలో ఆమె ఆకస్మాత్తుగా ఆమె కిందపడిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.ఆమె కుమారుడు కట్టా నాగరాజు ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. ఆమె గుండె పోటు వల్ల మరణించినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

ఆకివీడు, జూలై 11: కరెంటు షాక్ కొట్టి కూలీ మృతి చెందాడు. తరటావకు చెందిన యాళ్ల రమేష్ (32) గురువారం చెరువుపై గడ్డి కోయడానికి వెళ్లాడు.గడ్డి కోస్తుండగా మోటారు వైర్ మీద కాలు వేయడంతో షాక్ కొట్టగా అక్కడకక్కడే మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ జట్టు కూలీ మృతి

పెంటపాడు, జూలై 11 : బస్తాల మేటుపై నుంచి జారిపడి చికిత్స పొందుతూ జట్టు కూలీ మృతి చెందాడు. మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన జమ్ము శ్రీనివాస్ అలంపురం ఎంసీ వినాయక రూరల్ గొడౌన్‌లో జట్టు కూలీగా పనిచేస్తున్నాడు. గత నెల 18న లారీ లోకి తౌడు బస్తాలు లోడింగ్ చేస్తున్న క్రమంలో బస్తాల మేటుపై ఉన్న శ్రీనివాస్ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శ్రీనివాస్ బుధవారం రాత్రి మృతి చెందాడని, మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం శంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

టి.నరసాపురం, జూలై 11: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం పంచాయతీలోని ముత్యాలమ్మపేటకు చెందిన తాతా కాశీ విశ్వనాథం కడుపు నొప్పి తాళలేక ఈ నెల 8న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్.ఐ.డి దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం సరిహద్దు తగాదా..కేసు నమోదు

ఉండి, జూలై 11: స్థలం సరిహద్దు విషయంలో వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. తన స్థలానికి సంబం ధించి సరిహద్దు దారుడు బొబ్బాది సత్యనారాయణ అతని కుటుంబసభ్యులు ఈనెల 9న తనతో గొడవ పడ్డారని కొట్టి గాయపరిచారని ఉండి గ్రామానికి చెందిన వెన్ని సాయివినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కొడుకు స్నేహితుడని ఆశ్రయం ఇస్తే.. బంగారం కొట్టేశాడు

ఏలూరు క్రైం, జూలై 11 : కుమారుడి స్నేహితుడని ఆశ్రయం ఇస్తే ఇంటిలో ఉన్న బంగారాన్ని అపహరించుకుని పోయిన ఓ యువకునిపై గురువారం రాత్రి కేసు నమోదైంది. ఏలూరు కొత్తపేటకు చెందిన మల్లెపురెడ్డి మోహనరావు కుమారుడికి కైకరానికి చెందిన గణపవరపు తేజ స్నేహితుడు. ప్రస్తుతం తేజ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఏలూరులో పని ఉందంటూ ఇటీవల ఏలూరు వచ్చాడు. నాలుగు ఇక్కడే ఉండాలని హోటల్ రూములో ఉండడానికి తన వద్ద అంత సొమ్ము లేదని మీ ఇంట్లో ఉంటానని తన స్నేహితుడిని కోరడంతో ఆ విషయాన్ని తన తండ్రి మోహనరావుకు చెప్పడంతో ఆయన అంగీకరించి ఆశ్రయం కల్పించారు. ఆ ఇంట్లో ఉన్న సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను తేజ తాడేపల్లిగూడెం తీసుకువెళ్లి ఒక గోల్డ్ షాపులో తాకట్టుపెట్టాడు. అయితే అతనితో పాటు మోహనరావు కుమారుడిని కూడా జతకు తీసుకువెళ్లి షాపు బయటే నిలబెట్టాడు. తేజ వెళ్లిపోయిన తరువాత ఇంట్లో బంగారం కనిపించలేదు. గూడెం నగల దుకాణానికి వెళ్లినట్టు కుమారుడు చెప్పడంతో వెంటనే తాడేపల్లిగూడెం వెళ్ళి గోల్డ్‌షాపులో విచారించగా మూడు లక్షల 90 వేల రూపాయలకు తాకట్టు పెట్టాడని చెప్పడంతో మోహనరావు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



భీమడోలు, జూలై 11 : అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. తణుకు నుంచి కురెళ్ళగూడెం వైపు రేషన్ బియ్యంతో వెళుతున్న ఆటోను అడ్డుకున్నారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కె.మణికంఠ ఆటోలో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమా చారం పోలీసులు కురె ళ్ళగూడెంలో ఆటోను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ లక్షా 42 వేల 800 రూపాయలు ఉంటాయని సీఎస్ డీటీ మాధవరావు తెలిపారు. నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి నిత్యావసర సరుకులు


కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, జేసీ

ఏలూరు టూటౌన్, జూలై 11: వైసీపీ ఐదేళ్ల పాలనలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎన్నికల హామీ మేరకు నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతు బజారులో కందిపప్పు కేజీ రూ.160, సోనమసూరి బియ్యం రూ.49 చొప్పున అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వారు గురువారం రైతుల బజారును సందర్శించారు. కందిపప్పు, బియ్యం సబ్సిడీ ధరల దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం చంటి, ప్రభాకర్, మహేష్‌యాదవ్‌లు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు రూ. 181 కాగా హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడి రూ. 160 ధరకు అందిస్తున్నామన్నారు. మేలురకం బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.55 కాగా రూ.49 చొప్పున అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు : చింతమనేని


చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

పెదపాడు, జూలై 11: టీడీపీ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేసినట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, కార్మికుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే చింతమనేని, కూటమి శ్రేణులు గురువారం పాలాభిషేకం చేశారు. అనంతరం చింతమనేని ఇసుక ట్రాక్టరును నడిపారు. అనంతరం పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వట్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో దూళిపాళ్ల భానుప్రకాష్ తండ్రి ఆదినారాయణ జ్ఞాపకార్థం రూ.3 లక్షలతో అందజేసిన 10 కంప్యూటర్లను ఎమ్మెల్యే చింతమనేని ప్రారంభించారు. డీఈవో అబ్రహాం, ఉప్పలపాటి రాంప్రసాద్, కొమ్మన వెంకట శ్రీధర్, కొమ్మన లక్ష్మణమోహన్, గుత్తా అనిల్, అక్కినేని వంశీ, కొత్తూరు చినబాబు, ఎంపీడీవో తేజరతన్, ఎంఈవోలు వెంకటరమణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : జేసీ

పెదవేగి, జూలై 11: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పలు సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం జేసీతో సమావేశమైన చింతమనేని నియోజకవర్గంలో భూ సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఖరీఫ్ సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చింతమనేని రైతుల తరపున జేసీకి విన్నవించారు. అవసరమైన చర్యలు చేపడతామని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

అంతకు ముందు దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలను అందించాలని సూచించారు.

ద్వారకా తిరుమలలో ఎమ్మెల్యే మద్దిపాటి పర్యటన


స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూలై 11: ద్వారకా తిరుమల పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని తహసీల్దారును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశించారు. గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. నాయి బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రెండు చోట్ల ఖాళీ భూమిని చూశారు. అనంతరం ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని తహసీల్దారును ఆదేశించారు. సంతమార్కెట్ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణానికి హామీ ఇచ్చారు. పలువురు మహిళలు ఇళ్ల స్థలాలు లేవని ఇవ్వాలని కోరారు. మొగతడకల శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మటపర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన నేతలు

ఉంగుటూరు, జూలై 11: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ధర్మరాజుకు సీపీఎం నేతలు గురువారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా కాంటూరు సమస్య ఉందన్నారు. 5వ కాంటూరు నుంచి 10 కిమీ పరిధిలో విస్తరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని, నిడమర్రు, గణపవరం పరిధిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జూనియర్ కళాశాల గ్రామాలకు లింక్ రోడ్లు, తాగునీరు, పేదలకు ఇంటి స్థలాలు, భీమడోలు రైల్వే వంతెన నిర్మాణం, బొబ్బిలి వంతెన, కేశవరం, నారాయణపురం, పూళ్ళ, గుండుగొలను వంతెనల నిర్మాణం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీపీఎం నేత ఆర్.లింగరాజు, గుత్తికొండ వెంకట కృష్ణారావు, నారపల్లి రమణారావు, పచ్చిపులుసు గోవిందు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో స్థానికులను నియమించాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 11: ఏజెన్సీ ప్రాంతం బుట్టాయిగూడెం, విప్పలపాడు ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో ఉత్తరాదికి చెందిన 18 మందిని నియమించారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో చాలా చోట్ల ఉత్తరాది వారిని నియమిస్తున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దక్షిణాదిలో హిందీని బలవంతంగా రుద్దాలనే అజెండాలో భాగంగానే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పరిశీలించి ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. హిందీ మాత్రమే వచ్చిన వారు ఇక్కడ ఏ భాషలో విద్యా బోధన చేయగలుగుతారని ప్రశ్నించారు.





ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిడమర్రు మండలం పెదనింద్రకొలను, పెదవేగి, ఉంగుటూరు మండలం కాగుపాడు, లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ

చిన్న కుటుంబంతో చింతలు దూరం

జనాభా పెరుగుదల అభివృద్ధికి ఆటంకం
ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీలు

ఏలూరు అర్బన్, జూలై 11: చిన్న కుటుంబంతో చింతలుండవని, జనాభా పెరుగుదలతో దేశ అభివృద్ధి కుంటుపడుతుందని జిల్లా వైద్యాధికారి శర్మిష్ట అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. జనాభా పెరుగుదలతో నిరుద్యోగ సమస్య, ఆరోగ్య సమస్యలు, ఆహార కొరత ఏర్పడతాయన్నారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలతోపాటు, రక్తహీనత, గర్భస్రావం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చిన్న కుటుంబాలు, బిడ్డకు బిడ్డకు ఎడమ పాటించడంతో జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. డీఐవో నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు గోవిందరావు, శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. పవర్‌పేట అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ, ఎంహెచ్‌వో మాలతి, డాక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక జనాభా ద్వారా దుష్పరిణామాలను విద్యార్థినులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు రత్నమేరీ, ఎస్తేర్ కళ్యాణి, జోస్పిన్, చిట్టెమ్మ, కుసుమకుమారి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు: చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమని, ప్రతి కుటుంబం ఒక్కరు లేదా ఇద్దరు సంతానంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు చేసుకోవాలని పెదనింద్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించి అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను, చిన కుటుంబబ వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పి.కృపావరం, పీహెచ్ఎన్ మరియమ్మ, చంద్రరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదవేగి: కుటుంబ నియంత్రణతో జనాభా పెరుగుదల తగ్గుతుందని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణిమ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనాభా నియంత్రణ పద్ధతులు, పాటించాల్సిన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల వ్యవధి ఉండాలని, పిల్లల ఆరోగ్యంతోపాటు జనాభా నియంత్రణకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని కాగుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది. హైస్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అనూష, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, హైస్కూలు ఉపాధ్యాయులు శీతాల సత్యనారాయణ, జయవర్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ యానిప్రీతి అన్నారు. ధర్మాజిగూడెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థి దశ నుండే ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇల్లు, గ్రామం వారీగా పరిశుభ్రంగా ఉంచేలా విద్యార్థులు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది జనాభా నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలు, తల్లి బిడ్డ ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యులు శ్రీరేణ్య, మహదేవమ్మ, కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

● భీమడోలు: పూళ్ళ, గుండుగొలను పీహెచ్‌సీల పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. పూళ్ళ వైద్యురాలు కల్యాణి మహేశ్వరి, సూపర్‌వైజర్ కిషోర్, మోహన్‌బాయి, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: జనాభా నియంత్రణ బాధ్యత అందరిది అని, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మాదేపల్లిలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు ఎలిజబెత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ఎంపీని కలసిన ఎమ్మెల్యేలు, నేతలు

భీమడోలు, జూలై 11: జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు, ఏలూరు ఎంపీతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు భేటీ అయ్యారు. గన్ని ఆహ్వానం మేరకు ఎమ్మెల్యేలు బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ గన్ని గృహానికి వచ్చారు.

● ఏలూరు టూటౌన్: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

● కామవరపుకోట: మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జుజ్జూరి బాబ్జి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వాసుపత్రి, సహకార సంఘం, పెట్రోలు బంకులు, గుంటుపల్లి బౌద్ధ గుహల వద్ద పర్యాటకం, ఆడమిల్లి డిగ్రీ కళాశాల హాస్టల్, విద్యుత్, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

● లింగపాలెం: మండలం అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు కోరారు. ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి మండలంలో పలు సమస్యలు ప్రస్తావించారు. మోరంపూడి మల్లికార్జున్‌రావు, తాతిన రాధాకృష్ణ, పాతూరి మురళీ, పలువురు నాయకులు ఎంపీని కలిశారు.

గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వరరావు


బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు

పెదవేగి, జూలై 11: బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా మాడా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల క్రితం ఇక్కడ బోటనీ అధ్యాపకుడిగా బదిలీపై వచ్చిన ఆయన ఏడాది నుంచి వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఆయనను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్.ఆచార్యులు, పీడీ కె.జయరాజు, అధ్యాపకులు ఎస్ఎస్.సర్వేశ్వరరావు, ఏవీ.శివప్రసాద్, సత్యమూర్తి, బి.సత్యనారాయణ అభినందించారు.

బాలల ఆరోగ్య సంరక్షణ అంగన్‌వాడీల ధ్యేయం

పెదవేగి, జూలై 11: చిన్నారుల బాధ్యత అంగన్‌వాడీలపై ఉందని ప్రథమ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలు, బోధనా సామగ్రితో పిల్లలకు అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యావిధానాన్ని పరిశీలించారు. చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనూరాధ, మల్లిక పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

బుట్టాయగూడెం, జులై 11: ఎస్సీ, ఎస్టీ పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ పేట దళితులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సీజనల్ జ్వరాలు, డెంగీ కేసులు పెరుగుతున్నందున డ్రెయినేజీలను శుభ్రంచేసే పనులు వేగవంతం చేయాలన్నారు. దోమల మందు చల్లించాలని, దోమతెరలను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ప్రజలకు మంచినీటిని అందించాలని కోరారు. ప్రవేటు వాటర్ ప్లాంటులో అధిక ధరలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.డేవిడ్‌రాజ్, ఎస్.సుబ్బారావు, మేరీ, దుర్గా, సీత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కూటమి శ్రేణులకు గుర్తింపు ఉంటుంది


సమావేశంలో మాట్లాడుతున్న రావూరి కృష్ణ

జంగారెడ్డిగూడెం, జూలై 11: కూటమి విజయానికి కష్టపడి పనిచేసిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. టీడీపీ పట్టణ సమావేశం రావూరి కృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. చింతలపూడి ఏఎంసీ చైర్మన్ పదవి జంగారెడ్డిగూడెం పట్టణ నేతలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ సచివాలయానికి ఆయా వార్డుల నాయకులను బాధ్యులుగా చేయాలని సూచించారు. మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, రాజాన పండు, తూటిగుంట రాము, కిషోర్, ప్రసాద్, నాగేశ్వరరావు, దుర్గారావు, రామలింగేశ్వరరావు, అంబేడ్కర్, తాతాజీ, జగత్, బాల చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ద్వారకా తిరుమల, జూలై 11: వేతన బకాయిలు ఇవ్వాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మండల విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం ఆందోళన చేశారు. సమ్మెకాలం జీతం, అగ్రిమెంట్‌లను అమలు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెన్యువల్ చేయాలని, వారిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని కోరారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, వి.చంద్రశేఖర్, జయకుమార్, పద్మావతి, కనకరాజు. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ అధ్యక్షుడు రాంపండుకు సన్మానం

ద్వారకాతిరుమల, జూలై 11: ద్వారకాతిరుమలలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండప చైర్మన్ బొండాడ రామ్మోహనరావు (రాంపండు) భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం రాంపండును ఆర్యవైశ్య సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇమ్మడి రత్నాజీ, మానేపల్లి బాబ్జి, ఇమ్మడి నాగు, ఒబిలిశెట్టి కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారు

జంగారెడ్డిగూడెం, జూలై 11: మండలంలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, ఇటీవల అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న తమను గ్రామాలలో జరిగే ప్రతీ ప్రభుత్వ కార్యక్రమానికి ఆహ్వానించాలని కోరారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెప్మా ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

ఏలూరు టూటౌన్, జూలై 11: మెప్మా ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి డిమాండ్ చేశారు. ఐద్వా కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. మెప్మా ఉద్యోగుల అక్రమ తొలగింపును ఆపాలన్నారు. మెప్మా పీవో ఆర్పీల లాగిన్లు నిలిపివేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీహెచ్.వెంకటలక్ష్మి, సీహెచ్.రాజ్యలక్ష్మి, ఎం.శారద, భవాని, నాగమణి, షేక్ సైదాని, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు


కుప్పాల రాజు, సాయిధర్మతేజ

లింగపాలెం, జూలై 11: మండలంలో ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్లు ఎంఈవో కె.రామారావు తెలిపారు. రంగాపురం జడ్పీ హైస్కూల్ నుంచి కుప్పాల రాజా, ధర్మాజిగూడెం హైస్కూల్ నుంచి సాయి ధర్మతేజ ట్రిపుల్‌ఐటీ ఒంగోలులో సీటు సాధించినట్లు ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో -2 రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు వెంకటరత్నం, బి.వి.ఎస్.ఎన్ రాజు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు విద్యార్థులు ఎంపిక


ఎ.పవన్

ఏలూరు అర్బన్ / రూరల్, జూలై 11 : ట్రిపుల్ ఐటి ప్రవేశాల్లో ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలు ముందంజలో ఉన్నారు. ఏలూరు బీజీబీవో మున్సిపల్ హైస్కూలు నుంచి అట్టా పవన్ ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌కు ఎంపికయ్యాడని హెచ్ఎం కె.వి.షడక్ వివరించారు. పవన్ తల్లితండ్రులు ప్రసాద్, భూలక్ష్మి రోజువారీ కూలిపని చేసుకుంటారు. పవన్‌ను స్కూలు ఉపాధ్యాయులు అభినందించారు.


లీలాసాయికృష్ణ, నేహ

ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జడ్పీ హైస్కూల్లో ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో గడ్డం లీలాసాయికృష్ణ, యర్రబోలు నేహ సీట్లు సాధించారని పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి తెలిపారు. వారిని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, మేరీ ఎలిజబెత్, శివశంకర్, దుర్గ, వెంకటేశ్వరమ్మ, ఉషశ్రీ, అపర్ణ, యాస్మిన్, మణి అభినందనలు తెలిపారు.

చింతలపూడి మండలంలో ఇద్దరు ఎంపిక

చింతలపూడి, జూలై 11: మండలంలో ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించారని ఎంఈవో కిరణ్ తెలిపారు. చింతలపూడి సుబ్బరాజు పాఠశాల విద్యార్థిని కానూరి మహితకు ఒంగోలు, యర్రగుంటపల్లి విద్యార్థి గోగులమూడి కుమార్ శ్రీకాకుళంలో సీటు దక్కిందని ఆయన తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

ఏలూరు అర్బన్, జూలై 11: ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 20వరకు పొడిగించినట్లు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు గురువారం తెలిపారు. కోర్సుల ఎంపిక 23 నుంచి 26 వరకు ఉంటుందని, విద్యార్థులు కళాశాలలో ఏర్పాటుచేసిన ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించవచ్చన్నారు.

● ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు తెలిపారు. బీఏ ఎకనామిక్స్ 40 సీట్లు, బీఎస్సీ జువాలజీ 40 సీట్లు, బి.కాం కంప్యూటర్స్ 60 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్స్ 40 సీట్లు ఉన్నాయన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** మేకల కబేళాను అభివృద్ధి చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ అన్నారు. పర్యావరణానికి హాని జరగకుండా జంతువుల వ్యర్థాలను ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ద్వారా శుద్ధి చేస్తామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, ఎంఈ కొండలరావు, డీఈ తాతాబాబు, తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు నగర ప్రజలు వ్యాధుల బారీనపడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. దోమల నిర్మూలనకు ఆరు హ్యాండ్ ఫాగింగ్ మిషన్లను వినియోగంలోకి తెస్తున్నామన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** కత్తేపువీధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 17న సీతమ్మ అమ్మవారికి మేళతాళాలు, ఊరేగింపుగా వచ్చి సారె సమర్పిస్తారని అర్చకులు కె.శ్రీనివాస్, ధర్మకర్తలు బెజవాడ సత్యనారాయణ, తమ్మన కృష్ణ, తమ్మన దుర్గాప్రసాద్ తెలిపారు.
- ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రంలో వాసవీ మాతకు ఈనెల 17న కూరగాయలతో అలంకరిస్తామని చెక్కా రాజారావు, చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** వన్‌టౌన్ కోటదిబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయబడునని ఈఈ నటరాజన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
- **నిడమర్రు :** భువనపల్లి ఉమా మార్కండేయ స్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. దాతల సహకారంతో రూ.25 లక్షలు వెచ్చించి పనులు చేపట్టినట్లు కమిటీ చైర్మన్ అల్లుమోలు అంతర్వేది తెలిపారు.
- **ఉంగుటూరు :** నారాయణపురంలో శుక్రవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు.
- ఉంగుటూరు మండలం గొల్లగూడెం పరిసర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.
- పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు నిడమర్రు కార్మికులు వినతిపత్రం అందించారు.
- **జంగారెడ్డిగూడెం :** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తగ్గింపు ధరలతో కందిపప్పు, బియ్యం విక్రయ కౌంటరు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం ప్రారంభిస్తారని రావూరి కృష్ణ, తూటిగుంట రాము తెలిపారు.
- **చింతలపూడి :** ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ఈనెల 24, 25, 26 తేదీల్లో మదనపల్లిలో జరుగుతాయని వీటిలో పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విజ్ఞేష్ పిలుపునిచ్చారు.




బుట్టాయగూడెం, కొయ్యలగూడెంలో అవగాహన కార్యక్రమాలు, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో కౌలు రైతులకు సాగు హక్కు పత్రాల పంపిణీ

కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, జులై 11: కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మండలంలోని అలివేరు, దొరమామిడి, సీతప్పగూడెం, విప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో గురువారం కౌలు సాగుదారు హక్కు పత్రాలు జారీ, అవగాహన సదస్సులను నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు వలన పంటలు నష్టపోతే కౌలు రైతులకు పరిహారం అందుతుందని, పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ నుంచి రాయితీపై వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చన్నారు. స్వల్పకాల రుణాలు పొందవచ్చని, సున్నావడ్డీ పంట రుణాలు వస్తాయని, అన్నదాత సుఖీభవ పథకం అందుతుందన్నారు. సీసీఆర్‌సీ కార్డులు కావలసిన ఎస్టీ రైతులు రైతుసేవా కేంద్రాలను సంప్రదించి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో కౌలు రైతులకు సాగు హక్కుపత్రాల పంపిణీ చేశారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, ఉప సర్పంచ్ వి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పోల్నాటి సత్యనారాయణ, ఎలికే ప్రసాద్, మోహన్, వెంకటేశ్వరరావు, చంద్రరావు సచివాలయ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎ.పోలవరంలో సర్పంచ్ సీతారామరాజు, నాదెండ్ల కృష్ణ, కొడాలి శ్రీనివాసరావు, ధర్మరాజు, వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి పద్మజ, వీఆర్వో రవికుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: కౌలురైతు కార్డుల జారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏవో చెన్నకేశవులు తెలిపారు. గంగవరం, రాజవరం గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ అవకాశం రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వాడపల్లి రమేష్, కేసిబాబు, పరిసర రైతులు పాల్గొన్నారు.

● పోలవరం: కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాలు విధిగా పొందాలని ఏవో కె.రాంబాబు సూచించారు. గూటాల సచివాలయంలో అవగాహన కల్పించారు. పాపోలు గణపతి రత్తయ్య, ఏనుగుల శ్రీనివాస్, ఆటపాల వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజరాజేశ్వరి

ఏలూరు క్రైం, జూలై 11: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జంగారెడ్డిగూడెం సివిల్ న్యాయాధికారి ఎం.రాజరాజేశ్వరి తేజస్విని అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో స్వాతి మహిళా అభ్యుదయ సంఘం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథి రాజరాజేశ్వరి తేజస్విని మాట్లాడుతూ ప్రతి మహిళ సమాజంలో ప్రతి విషయంపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి బాలిక చిన్ననాటి నుంచి సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేలా తర్ఫీదు పొందాలన్నారు. మానవ అక్రమ రవాణాపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయాధికారులు పీవీఎస్ఎన్ లక్ష్మీలావణ్య, పీవీ.నాగరంజిత్‌కుమార్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ మంగాకుమారి, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగమణి, మహిళా సంఘం పీవో నవీన్‌కుమార్, అడ్వకేట్స్ కూనకృష్ణారావు, పి.రత్నరాజు పాల్గొన్నారు.

● చింతలపూడి: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని, స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.మధుబాబు అన్నారు. స్థానిక హయగ్రీవ పాఠశాలలో విద్యార్థినులకు న్యాయవిజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. కొన్ని చట్టాలపై ఆయన అవగాహన కల్పించి విద్యార్థినిలు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ సదస్సులో సీఐ సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో మాధవి, అక్బర్‌ఆలీ, ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ మెరిట్ జాబితా విడుదల

» 67.15 శాతం బాలికల ఎంపిక



మెరిట్ జాబితాను విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ అధికారులు

నూజివీడు, జూలై 11: ఆర్జీయూకేటీలో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశానికి క్యాంపస్‌ల వారీగా ఎంపిక కాబడిన విద్యార్థుల తుది జాబితాను గురువారం ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది 53,863 మంది ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో ఒక్కో క్యాంపస్‌లో వెయ్యిసీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్‌కోటా కింద అదనంగా 100 సీట్లతో నాలుగు క్యాంపస్‌లకు మొత్తం 4,400మంది విద్యార్థులతో భర్తీ చేస్తారు. వీరిలో 85 శాతం ఏపీ విద్యార్థులు ఉంటే 15శాతం ఓపెన్ మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు కేటాయిస్తారు. ఈ ఏడాది ఎంపిక కాబడిన విద్యార్థుల జాబితా ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 92.99శాతం మంది, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 7.01శాతం ఉంది. ఎంపికైన విద్యార్థుల్లో 67.15శాతం బాలికలు, 32.85శాతం మంది బాలురు ఉన్నారు. ఎంపిక కాబడిన విద్యార్థులు నూజివీడు ప్రాంగణంలో ఈనెల 22,23వ తేదీల్లో, ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ) ఎంపిక కాబడిన విద్యార్థులకు 22,23 తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లోనూ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కాబడిన విద్యార్థులకు ఈనెల 24,25 తేదీల్లో ఇడుపులపాయ ప్రాంగణంలో, శ్రీకాకుళం ప్రాంగణానికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 26,27 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తాని అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో రీరీరీ.టజ్ఞు.జీలో పెట్టామన్నారు. దరఖాస్తులో తెలిపిన ఫోన్ నంబర్లకు మెసేజ్, ఎస్ఎంఎస్ ద్వారా వివరాలు తెలిపామన్నారు. ఏ విద్యార్థి ఏ క్యాంపస్‌కు కౌన్సెలింగ్‌కు వెళ్లాలో కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లాల్సిన సర్టిఫికెట్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాలుగు ప్రాంగణాలకు సంబంధించిన డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



సంజన షణ్ముకసాయి చిట్టిపావని హాసిని వినీల సాయిశ్రీ

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు



శైలజ

ముసునూరు, జూలై 11: ట్రిపుల్ ఐటీ మెరిట్ జాబితా గురువారం విడుదల చేసిన సందర్భంగా జిల్లాలోని పలు మండలాల విద్యార్థులు ఎంపికయ్యారు. ముసునూరు మండలంలో ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. గోపవరం జడ్పీ పాఠశాల విద్యార్థిని దేవరపల్లి సంజన శ్రీకాకుళం క్యాంపెస్‌లో సీటు సాధించగా, వెల్పుచర్ల జడ్పీపాఠశాల విద్యార్థి డి.షణ్ముకసాయికి ఒంగోలు క్యాంపెస్‌లో సీటు వచ్చింది. ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో ముగ్గురు బాలికలు టి.చిట్టిపావని, జి.వినీల, కె.హాసిని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపెస్‌లో సీట్లు సాధించారు. వీరిని ఎంఈవో బి.వి.సుబ్బారావు, హెచ్ఎంలు నాగేంద్రరావు, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కె.ప్రవీణ అభినందనలు తెలియజేశారు.

● **చాట్రాయి మండలంలో ఐదుగురు..**

చాట్రాయి : మండలంలోని పలు పాఠశాలల నుంచి ట్రాపుల్‌ఐటీకి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. చిన్నంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు దన్నే మధు, అడ్డగట్ల భవిత ఒంగోలు క్యాంపస్‌కు.. జుజ్జూరి యస్వంత్ నూజివీడు క్యాంపస్‌కు, చనుబండ జడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ మహ్మద్‌నూర్, ఇదే గ్రామంలో ఉషోదయ స్కూల్ విద్యార్థి దేవరకొండ లోహిత్య ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారు.

● **మండవల్లి మండలంలో ఒకరు..**

మండవల్లి : ట్రిపుల్ ఐటీకి మండవల్లి విద్యార్థిని మారడాని సాయిశ్రీ ఎంపికైనట్టు హెచ్ఎం ప్రసాద్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు వివరించారు. సాయిశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

● **నూజివీడు మండంలో ఒకరు..**

నూజివీడు టౌన్ :నూజివీడు మండలం మీర్జాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిని పామర్తి శైలజ నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సీటు సాధించింది. బాలికను తల్లిదండ్రులు, హెచ్ఎం డి.వి.ఎల్ పుష్పలత, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందించారు.

వీఆర్వో కార్యాలయం పునఃప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విధుల్లో వున్న వీఆర్వో సత్యనారాయణ

కలిదిండి, జూలై 11 : వెంకటాపురంలో నిరుపయోగంగా ఉన్న వీఆర్వో కార్యాలయం భవనాన్ని గురువారం రెవెన్యూ అధికారులు పునః ప్రారంభించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన 'ప్రజాధనం వృథా' శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. వీఆర్వో కార్యాలయం ఆవరణలో ఉన్న మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, పిచ్చిమొక్కలను తొలగించారు. వీఆర్వో కార్యాలయంలో వీఆర్వో సత్యనారాయణ గురువారం విధులు నిర్వహిం చడం ప్రారంభించారు. ఇకపై వెంకటాపురం వీఆర్వో కార్యాలయం నుంచి వీఆర్వో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు.

కూటమి నేతలకు భవన కార్మికుల పాలాభిషేకం



బాబు, పవన్, సారథి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, జూలై 11: నూజివీడు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక శ్రీనివాస సెంటర్లో రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి పార్థసారథి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు తోట వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి భవననిర్మాణ కార్మికులు రుణపడి ఉంటారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు త్వరలో కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. నూజివీడు టీడీపీ నాయకుడు నూతక్కి వేణు మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి రావడం వల్ల రాష్ట్రంలో 48 లక్షల భవననిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తోందన్నారు. అనుభవజ్ఞుడైన మంత్రి పార్థసారథి సారథ్యంలో నూజివీడు అన్నివిధాలుగా అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు.

ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



లోకుమూడిలో ఆక్వా షాపులను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

మండవల్లి జూలై 11 : మండవల్లి మండలంలోని పలు ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పెరుగుతున్న కల్తీలను నివారించేందుకు రైతులకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం మత్స్యశాఖ, రెవెన్యూ డ్రగ్‌ఫుడ్, పోలీసు, ఎంపీడీవో అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిందని కైకలూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషా తెలిపారు. లోకుమూడిలోని నాలుగు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి నిషేధిత మందులు దొరకలేదని తెలిపారు. రైతుల ఉన్నతి కోసం ప్రభుత్వం పాటుపడుతుందని అందులో భాగంగా నాణ్యమైన విత్తనాలు, మందులు, మేతలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇటీవల ఆక్వాసాగులో యాంటీబయోటిక్స్ ఎక్కువగా వినియోగించడం వల్ల ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్న మన రొయ్యల్లో యాంటీబయోటిక్స్ అవశేషాలు ఉండడంతో వాటిని వెనుకకు పంపుతున్నారని తెలిపారు. రైతులంతా యాంటీబయోటిక్స్ వాడకం నిలుపుదల చేసి ప్రోబయోటిక్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆక్వా దుకాణాదారులు యాంటీబయోటిక్స్ అమ్ముతూ మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు జరిమానా విధిస్తామని మూడోసారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్ అధికారి జీవని, పెంపెడా అధికారి అమర్నాథ్. వీఆర్వో యువరాజ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు

» రాష్ట్ర వ్యాప్తంగా 282 కౌంటర్లలో బియ్యం, కందిపప్పు అమ్మకాలు : మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జూలై 11: పేదలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు, తక్కువ ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నూజివీడు రైతు బజారులో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు అమ్మకాల ప్రత్యేక కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. పలువురు కార్డుదారులకు ఆయన సరుకులను అందించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 282 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు అందిస్తున్నామని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక కౌంటర్‌లలో కందిపప్పు కేజీ రూ.160, బీపీటీ, సోనా మసూరి బియ్యం, కేజీ రూ.49, బీపీటీ సోనామసూరి ఫైన్‌రైస్ (రారైస్), కేజీ 48 చొప్పున ధరలకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, డీఎస్‌వో, ఆర్ఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలల్లో రైతుబజారు సమస్యలు పరిష్కరిస్తాం

రానున్న ఆరునెలల్లో రైతుబజారు సమస్యలను పరిష్కరించి, అధునాతనమైన రైతు బజారును నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి పార్థసారథి తెలిపారు. నూజివీడు రైతుబజారులోని దుకాణాలను గురువారం మధ్యాహ్నం ఆయన పరిశీలించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతు బజారు, పరిసరప్రాంతాల్లో శానిటేషన్ సరిగా లేదని, రేకులషెడ్లు పాడైపోయి వర్షం కురిసి ఇబ్బంది పడుతున్నామని, దుకాణాల అద్దెలను తగ్గించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే శానిటేషన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని పురపాలకశాఖ అధికారులను ఆదేశించారు.

పేదల కోసమే ధరల తగ్గింపు : కామినేని

కైకలూరు, జూలై 11: పేదల కోసమే తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు అందజేయాలని ప్రభుత్వం రైతుబజారులో కందిపప్పు విక్రయాలు ప్రారంభించిందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు వ్యవసాయ రైతుబజారులో దేశవాళి కందిపప్పు కేజీ రూ.160లకు అమ్మకాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్టీమ్ బియ్యం బీపీటీ, సోనామసూరి, కిలో రూ.49లకు రైతుబజారులో విక్రయిస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, కొల్లి వరప్రసాద్, పూల రాజీ, వీరాబత్తిన సుధా, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి పార్థసారథి..



కైకలూరులో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

తమ్మిలేరు కాజ్‌వే అప్రోచ్‌రోడ్డుకు మరమ్మతులు



చిన్నంపేటలో అప్రోచ్‌రోడ్డు వద్ద చేపట్టిన మరమ్మతులు

చాట్రాయి, జూలై 11: మండలంలోని చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే అప్రోచ్‌రోడ్డుకు వరద ఉధృతి వల్ల గండిపడే ప్రమాదం ఉండడంతో గురువారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. మంత్రి కొలుసు పారసారథి ఆదేశాల మేరకు నూజివీడు పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి బుధవారం కాజ్‌వేని పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పీఆర్ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. చిన్నంపేటకు చెందిన టీడీపీ జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి అత్తులూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూలీలు ఖాళీ సిమెంట్ సంచులలో ఇసుక నింపి అప్రోచ్‌రోడ్డుకు ఇరువైపులాఆ వాటితో గోడలా కట్టి మధ్యలో గ్రావెల్‌తో నింపి అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తున్నారు. కాజ్‌వే నిర్మాణ సమయంలో నిధులు సరిపోకపోవటంతో చిన్నంపేట వైపు తక్కువ ఖానాలు నిర్మించి నదిలో అప్రోచ్‌రోడ్డు వేయడం వల్ల ప్రతి ఏడాది వర్షాకాలంలో అప్రోచ్‌రోడ్డు గండిపడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అప్రోచ్‌రోడ్డుకు గండిపడితే చాట్రాయి, చింతలపూడి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. శివపురానికి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు చిన్నంపేట పాఠశాలల్లో చదువుతున్నారు. గండి పడినపుడు విద్యార్థులు స్కూల్స్‌కు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడుతుంది. చిన్నంపేట రైతులకు ఏటి అవతల, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సత్తుపల్లి నుంచి కాజ్‌వే మీదుగా విజయవాడకు నడిచే బస్సు సర్వీస్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆరు నెలల క్రితం ఇక్కడ కాజ్‌వేకి అదనపు ఖానాల నిర్మాణానికి రూ.20లక్షలు, చిన్నంపేట గ్రామం నుంచి కాజ్‌వే వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు ఎన్డీబీ నిధులు మంజూరై టెండర్లు పూర్తయ్యాయి. పనుల ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడింది. దీనిపై పంచాయతీరాజ్ ఏఈఈ కృష్ణను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావల్సి ఉందని అన్నారు.

జనాభా నియంత్రణకు శ్రద్ధ చూపాలి



రమణక్కపేటలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ

ముసునూరు, జూలై 11: ప్రతి పౌరుడు జనాభా నియంత్రణ పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా అన్నారు. రమణక్కపేటలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న కుటుంబం ద్వారా మెరుగైన సమాజం సాధ్యమవుతుందన్నారు. అవగాహన ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● కలిదిండి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి జాహ్నవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. కె.హేమ నాగమణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చాట్రాయి : తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం, బాల్య వివాహాలు వద్దు-సరైన వయస్సు వచ్చాకే వివాహాలు చేయండి.. కుటుంబ సంక్షేమం దేశ సంక్షేమం అంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. హెచ్ఎం వెంకట్రావు, ఏఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డుపై ఆందోళన వద్దు

నూజివీడు, జూలై 11: రైతులు, కౌలురైతు గుర్తింపు కార్డుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ గుర్తింపు కార్డు కేవలం 11 నెలలు ఉంటుందని మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. తుక్కులూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కౌలు రైతు గుర్తింపుకార్డులపై గ్రామసభ నిర్వహించారు. సభలో మండల రెవెన్యూ అధికారి శాస్త్రితో పాటు ఏడీఏ విద్యాసాగర్, ఎంఏవో చాముండేశ్వరి, ఈహెచ్ఏ చంటిబాబు పాల్గొన్నారు. కౌలురైతుల కార్డుపై, సంతకాలు పెట్టడానికి అసలు రైతులు ఒప్పుకోవడం లేదని, కౌలురైతులు సభలో స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, రైతులు, కౌలురైతు గుర్తింపు కార్డుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందించాలి



విద్యాబోధనపై సూచనలిస్తున్న ఎంఈవో సుబ్బారావు

ముసునూరు, జూలై 11: విద్యార్థులకు ఉత్తమ బోధనలను అందించి, వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈవో బి.వి.సుబ్బారావు సూచించారు. గురువారం రమణక్కపేట ఎంపీపీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, సబ్జెక్ట్స్ వర్కుబుక్స్‌ను పరిశీలించి, విద్యాబోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కిచెన్ గార్డెన్‌ని నిర్వహించాలని వంట ఏజన్సీ నిర్వాహకులకు ఎంఈవో సూచించారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి 'తల్లికి వందనం'పై అవగాహనం కల్పించాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కె.లోకరాజుకు సూచించారు. ఉపాధ్యాయులు బి. సురేష్ నారాయణరావు, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి, జూలై 11: మెగా గ్యాస్ వారి ఆధ్వర్యంలో ఆగిరిపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో సహజవాయువు, రహదారి భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రమాదాలు జరిగితే సమాచారం తెలపాల్సిన నంబర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్కూల్ హెచ్ఎం మాట్లాడుతూ ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు మెగా గ్యాస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. గ్యాస్ లీక్ సమయంలో ఎమర్జన్సీ నంబరు 1800 123 1803, 70930 82044కు తెలపాలని గ్యాస్ యాజమాన్యం విద్యార్థులక సూచించారు.

జీతాల బకాయిలు విడుదల చేయాలి

» కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



ఎంఈవోకి వినతిపత్రమిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

చాట్రాయి, జూలై 11: పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, సమ్మె అగ్రిమెంట్స్ అమలు చేయాలని కోరుతూ గురువారం చాట్రాయి ఎంఈవో కార్యాలయం ఎదుట ఏపీ సర్వశిక్షా కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు నిరసన తెలిపారు. సమ్మె కాలం జీతం ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, ఎంటీఎస్ వర్తింపజేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్ల పెంచాలని తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈమేరకు ఎంఈవో బ్రహ్మచారికి వినతిపత్రం అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామి నిత్యాన్నదాన పథకానికి విరాళం



అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాత కృష్ణమూర్తి దంపతులు

ముదినేపల్లి, జూలై 11 : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానం పథకానికి హైదరాబాద్‌కు చెందిన మునుకుట్ల కృష్ణమూర్తి-రామలక్ష్మి దంపతులు రూ.52,116 విరాళం అందజేశారు. గురువారం స్వామివార్లకు పూజలు నిర్వహించిన అనంతరం కృష్ణమూర్తి తన తండ్రి దివంగత సూర్యనారాయణ జ్ఞాపకార్థం విరాళం చెక్కును అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మకు అందజేశారు. దాత కృష్ణమూరిని దేవస్థానం ఏసీ ఎన్.సధ్య అభినందించారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

చాట్రాయి, జూలై 11: నరశింహారావుపాలెంలో టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు సమక్షంలో గురువారం పలువురు వైసీపీ కార్యకర్తలు పైడాల నాగేశ్వరరావు, అబ్బదాసరి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దాసు టీడీపీలో చేరారు. సీఎం చంద్రబాబు, నూజివీడు ఎమ్మెల్యే మంత్రి కొలుసు పార్థసారథి సమర్థ పాలనకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్టు వారు తెలిపారు.





శ్యామలాంబ అమ్మవారికి రామలింగేశ్వరస్వామివారికి ఆషాఢం సారె తీసుకువస్తున్న మహిళలు.. సమర్పించిన సారె

శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామికి ఆషాఢం సారె

కైకలూరు జూలై 11 : ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి, శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి కైకలూరుకు చెందిన పలువురు మహిళలు సారెను అందజేశారు. గురువారం కైకలూరు బ్రహ్మంగారి గుడి వీధి, కాల్వ గట్టు నుంచి మహిళలు పెద్దఎత్తున సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి, స్వామివారికి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కే శేఖర్ తన సిబ్బందితో వారికి ఆహ్వానం పలికారు. ఆలయ అర్చకులు అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో శశికళ, అరుణకుమారి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

విజయవాడ దుర్గమ్మకు ఆషాఢం సారె

కైకలూరు వికాసత రంగణి అధ్వర్యంలో శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడం సారెను గురువారం అందజేశారు.

సాయిబాబా మందిరంలో పూజలు



ముదినేపల్లి :పెయ్యేరు శివారు రంగాపురంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు అధిక సంఖ్యలో పూజలు జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, అర్చకుడు రమేష్ ఆధ్వర్యంలో బాబాకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మందిరం వద్ద అన్నసమారాధన జరిగింది. బొమ్మినంపాడు, శ్రీహరిపురం గ్రామాల్లోని బాబా మందిరాల్లో భక్తులు సంఖ్యలో అభిషేకాలు జరిపారు.



కైకలూరులో చెత్త తొలగింపు పనులను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పంట కాల్వల్లో చెత్త తొలగింపు పనులు

కైకలూరు జూలై 11 : పంట కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు పంట కాల్వలో చెత్త తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, మానవత సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొండ్రెడ్డి సత్యనారాయణ, గుర్రం శ్యాంకుమార్, ఏఈ శ్రీనివాస్, వార్డు సభ్యులు కేవీఎస్ఎం నాయకుడు, బెల్లాని శ్యామలరావు తదితరులు ప్రత్యేక కమిటీగా ఏర్పడి స్వచ్ఛందంగా చెత్త తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. 30 మంది కూలీలతో కాల్వల్లోని చెత్తను తొలగిస్తున్నారు. శుక్రవారం నుంచి ఎక్స్‌కవేటర్లతో చెత్తచెదారాన్ని తొలగించే పనులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మంత్రి దృష్టికి ఆగిరిపల్లి సమస్యలు

ఆగిరిపల్లి, జూలై 11: ఆగిరిపల్లిలో సమస్యలను మంత్రి పార్థసారథి వద్ద మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు ఏకరువు పెట్టారు. 12వేల జనాభా కలిగిన ఆగిరిపల్లిలో డ్రెయినేజీ ప్రధాన సమస్యగా ఉందని, కొత్త గృహాలు నిర్మించుకోవాలంటే డ్రెయినేజీ వ్యవస్థ ఆటంకంగా మారిందని, సుమారు 13 ఎకరాల శ్మశాన భూమి తుప్పలతో నిండిందని, అక్కడ ఉన్న కనకదుర్గమ్మ ఆలయం గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు మట్టి దిబ్బలతో మూసేశారన్నారు. టూరిజంకు అవకాశం ఉన్న శోభనాచల స్వామికొండపైకి ఘాట్‌రోడ్డు ఏర్పాటు చేయాలని, నూతన సచివాలయ భవనం ఐదేళ్లుగా నిర్మాణ దశలోనే ఉందని, గన్నవరం రోడ్డు అధ్వానంగా ఉందని మాజీ సర్పంచ్‌లు సగ్గుర్తి రమేష్, నెరుసు పుణ్యవతి, బుజ్జి, స్వరూపరాణి, మడుపల్లి గోపాల్ గురువారం మంత్రి వద్ద విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా వంశీ

ఆగిరిపల్లి, జూలై 11:పీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా కోలంటి వంశీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన ఆగిరిపల్లి మండల కార్యవర్గ సమావేశంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షురాలిగా బీవీఎస్ లక్ష్మి, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.వంశీ ఎంపక్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన సభ్యుల సంఘం ఆదర్శాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎంవీఎస్ నాగేంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి జోజయ్య, మహ్మద్ ఇర్ఫాన్‌పాషా, పెద్ద సుబ్రహ్మణ్యం, రామ్‌సింగ్ నాయక్, గోపి, బాలశేఖర్, ఖదీర్, ఉపాధ్యాయ సేవాదళ్, కన్వీనర్ అచ్చన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ముదినేపల్లి, జూలై 11 : పెదపాలపర్రు గ్రామం వద్ద జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల సర్దుబాటు పనుల నిమిత్తం శుక్రవారం రెండు ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో ఏఈ పి.రవికుమార్ తెలిపారు. కోడూరు, పేరూరు 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

బాల్య వివాహాలపై అంగన్‌వాడీలకు అవగాహన



సభలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

మండవల్లి జూలై 11 : బాలికల పట్ల ఇటీవల పెరుగు తున్న హింసను అడ్డుకునేందుకు పోక్సో చట్టంతో పాటు పలు చట్టాలు ఉన్నాయని రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్ అన్నారు. మండవల్లి ఐసీడీసీ కార్యాలయంలో కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. బాలికల ఉన్నతకి ప్రభుత్వం ఎన్నో పథకాలు, ఎన్నో చట్టాలను రూపొందించిందన్నారు. అనంతరం బాల్య వివాహాల నియంత్రణపై అంగన్వా డీలకు అవగాహన కల్పించారు. సీడీపీవో దీప్తి సూపర్వైజర్లు లావణ్య, కృష్ణకుమారి పాల్గొన్నారు.